https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 35 శుక్రవారం 29-05-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# ఎన్టీఆర్.. ఓ స్ఫూర్తి





**హైదరాబాద్ సిటీ, మే 28**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఇందిరమ్మ స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆలోచనా విధానం కనిపిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాసంక్షేమం విషయంలో స్ఫూర్తి పొందడంలో తమకు ఇందిరమ్మ ఎంత ముఖ్యమో, ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ఇందిరమ్మ ఒక తరం అయితే ఎన్‌టీఆర్ ఒక శకమని, వారిద్దరి మేలు కలయికే ఈ నాటి కాంగ్రెస్ ప్రజాపాలన అని వ్యాఖ్యానించారు. నిరుపేదల అభ్యున్నతిని వారి ఆదర్శంతోనే కొనసాగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గురువారం రేవంత్ అమీర్‌పేట మైత్రి వనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ చరిత్రలో ముగ్గురు జాతి రత్నాలను స్మరించుకోవాలని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, ఉక్కుమహిళ ఇందిరాగాంధీల తర్వాత మూడో వ్యక్తి తెలుగు జాతి గర్వించదగ్గ నేత ఎన్‌టీఆర్ అన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు సమాన హక్కులు కల్పించింది అంబేడ్కర్ అయితే, భూస్వాముల వద్ద లక్షల ఎకరాల భూమిని తీసుకొని నిరుపేదలకు భూములిచ్చి గౌరవాన్ని కల్పించింది ఇందిర అన్నారు. యుద్ధంలో భారత ప్రధానమంత్రుల లొంగుబాటును చూస్తున్నామని, 1971లో ఇందిర పాకిస్థాన్ మీద యుద్ధం గెలిచి బంగ్లాదేశ్‌ను విముక్తం చేశారని చెప్పారు. భారత రాజకీయాలలో వేలు పెట్టొద్దని అమెరికా అధ్యక్షుడినే హెచ్చరించిన ఉక్కు మహిళగా అభివర్ణించారు. నీతి, నిజాయితీ, నిబద్ధత, ఉక్కు సంకల్పం ఉన్న నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే ఆయన ఎన్టీఆరేనన్నారు. ఆయన తెలుగు జాతి గర్వించదగ్గ బిడ్డ అని వ్యాఖ్యానించారు. మానవ మనుగడ ఉన్నంత కాలం ఆ ముగ్గురి కీర్తి ప్రతిష్ఠలు ఉంటాయని చెప్పారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ వ్యక్తికి హైదరాబాద్ నడిబొడ్డున విగ్రహం ఎందుకని ప్రశ్నిస్తున్నారని రేవంత్ ప్రస్తావించారు. అన్నగారు కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా దేశం గర్వించదగ్గ నేత అన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన అందిస్తున్న తమ ప్రభుత్వం ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం జీవితకాలం గుర్తుండిపోయే మధుర సంఘటన అని వ్యాఖ్యానించారు. ఎవరు ఏమనుకున్నా, ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా భయపడ దలచుకోలేదని చెప్పారు. పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, శివశంకర్, వెంకటస్వామి లాంటి నేతలను ఇందిరాగాంధీ అందిస్తే, మండవ వెంకటేశ్వర్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్‌గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులు వంటి నేతల్ని ఎన్టీఆర్ పరిచయం చేశారన్నారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది కూడా ఎన్టీఆరేనని గుర్తు చేశారు. అన్న నీడన బతికిన మీరు వారిని తక్కువ చేసి మాట్లాడడం మంచిదా? అని ప్రశ్నించారు. ఆయన పేరు పెట్టుకుని చలామణి అవుతున్న నకిలీ నాయకుల ఆలోచనలు ఎలా ఉంటున్నాయో చూస్తూనే ఉన్నామని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్‌టీఆర్ ప్రారంభించిన పక్కా ఇళ్ల పథకమే ఇప్పటి ఇందిరమ్మ ఇళ్ల పథకమని, రెండు రూపాయలకు కిలో బియ్యం పథకమే మెరుగుపరచి సన్న బియ్యం పథకంగా మార్చామని చెప్పారు. ఎన్‌టీఆర్ జనతా వస్త్రాల తరహాలోనే ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు ఇస్తున్నామని ప్రస్తావించారు. వైఎ?సప్రకటించిన రైతులకు ఉచిత కరెంటుకు స్ఫూర్తి ఎన్‌టీఆర్ పెట్టిన రూ.50కే హార్స్ పవర్ అని చెప్పారు. బలహీన వర్గాలు అన్న ఆశీర్వాదంతోనే పాలకులుగా మారారని చెప్పారు. పటేల్, పట్వారీ వ్యవస్థలను రద్దుచేసి తెలంగాణకు విముక్తి కల్పించిన ఘనత ఎన్‌టీఆర్‌ది అన్నారు. తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటం స్ఫూర్తితోనే ఇందిరమ్మ దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు భూములు పంచిందన్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఉండాలని రాజీవ్‌గాంధీ నిర్ణయం తీసుకుంటే దానిని అమలు చేసిన నాయకుడు ఎన్‌టీఆర్ అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, శాసనసభ, లోక్‌సభలో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే అంశానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ మహిళలకు ఇచ్చేలా ముందుకు వెళ్తామన్నారు. విద్యావంతులైన పాతికేళ్ల యువకులకు ఎన్‌టీఆర్ రాజకీయ అవకాశాలు కల్పించారని, తాము కూడా అదే ఆలోచనతో ముందుకు వెళ్తున్నామని ప్రకటించారు. మందుల సామేల్, వెడ్మ బొజ్జు లాంటి పేదలకు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేలు చేశామని, క్రీడాకారుడు అజారుద్దీన్, బీసీ వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి, విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో ఉన్న పొన్నం ప్రభాకర్ తమ మంత్రివర్గ సహచరులుగా ఉన్నారని ప్రస్తావించారు. 1994 నుంచి రాష్ట్రంలో ప్రతీ ప్రభుత్వం రెండు సార్లు అధికారానికి వచ్చిందని, 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెసే అధికారంలో ఉంటుందని ప్రకటించారు.

# హ్యామ్‌కు గ్రీన్‌సిగ్నల్

**క్యాబినెట్‌లో ఆమోదించిన మార్పులతో జీవో విడుదల**



**హైదరాబాద్, మే 28**

రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో చేపట్టాలని నిర్ణయించిన రోడ్ల పనులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ పనులలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే 14.5 శాతం అధిక ధరలను (ఎక్సెస్) కాంట్రాక్టర్లు తమ టెండర్లలో కోట్ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ పనులకు సంబంధించి 5 కీలక సవరణలు చేయాలని నిర్ణయించారు. ఆ మార్పులతో తాజాగా జీవో ఎంఎ?స-21ని ప్రభుత్వం జారీ చేసింది. సవరణల్లో భాగంగా మొదట ఈ పనుల్లో ప్రతిపాదించిన పెట్రోలింగ్ వాహనాలు, అంబులెన్స్‌లను రద్దు చేసి, రాష్ట్రంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న 'డయల్-100' సేవలను హ్యామ్ ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. రోడ్ల పనుల్లో భాగంగా కాంట్రాక్టర్లు చెల్లించే జీఎస్టీని వారికి వెంటనే రీయింబర్స్‌చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్కారు నిర్ణయించిన ధరల కంటే ఐదు శాతం మించకుండా మరోసారి టెండర్లను ఆహ్వానించనున్నారు. ఆ మేరకు వచ్చే టెండర్లను టెండర్ కమ్ ఎవాల్యుయేషన్ కమిటీ పరిశీలించి ఖరారు చేస్తుంది. టెండర్లు ఖరారైన కాంట్రాక్టర్లతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. ఆర్ అండ్ బీలో రూ.13,006 కోట్లు, పంచాయతీరాజ్‌లో రూ.6 వేల కోట్లు కలిపి మొత్తం రూ.19 వేల కోట్లతో హ్యామ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. జూన్ రెండు, మూడో వారాల్లో ఈ పనులను మొదలుపెడతారు. పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నియోజకవర్గాలైన నల్లగొండ, ములుగులో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ సభలకు సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం.

# పరస్పర సహకారంతో జలవివాదాల పరిష్కారం

**రాష్ట్రాలకు ప్రధాని మోదీ సూచన**



**న్యూఢిల్లీ, మే 28:**

అంతర్రాష్ట్ర జలవివాదాలను పరస్పర సహకారం, సకాలంలో అనుమతులు, సాంకేతిక పర్యవేక్షణ మొదలైనవాటి ద్వారా పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని మోదీ సూచించారు. కరువుపీడిత బుందేల్‌ఖండ్‌కు నీరిచ్చేందుకు చేపట్టిన మధ్యప్రదేశ్‌లోని కెన్-యూపీలోని బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టును ఆదర్శంగా తీసుకోవాలని గురువారం 'ఎక్స్'లో తెలిపారు. దీర్ఘకాలిక నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జలసంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్, సమర్థ నీటిపారుదల సౌకర్యాల కల్పనకు ఉన్న అవకాశాలను గుర్తించేందుకు రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. బుధవారం ఆయ న ఆధ్వర్యంలో 51వ ప్రగతి సమావేశం జరిగింది. ఇందులో 9 రాష్ట్రాల పరిధిలో చేపట్టిన రూ.30 వేల కోట్ల విలువైన రైల్వే, విద్యుత్, రోడ్ల ప్రాజెక్టులపై సమీక్ష జరిపారు. ప్రాజెక్టుల అమలులో ఆలస్యం జరిగితే ఖర్చులు పెరగడమే గాక.. పౌరులకు సకాలంలో అత్యవసర సేవలు అందకుండా పోతాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కాలువల వ్యవస్థను సరికొత్తగా వినియోగించుకోవాలన్నారు. కాలువల వెంబడి, వాటిపైన సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని.. హరిత ఇంధన ఉత్పత్తికి వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు.

# ప్రపంచానికే తలమానికంగా ఫ్యూచర్ సిటీ

**విశ్వనగరాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం**

**నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, మే 28**

ప్రపంచానికే తలమానికంగా ఉండేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనులను గురువారం వారు పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ డెవల్‌పమెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుతో హైదరాబాద్‌తో విశ్వనగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎంతో చర్చించి త్వరలోనే ఎఫ్‌సీడీఏ కార్యాలయం ప్రారంభానికి తేదీని ఖరారు చేస్తామని చెప్పారు. ఇక్కడ చేసే ప్రతి పని, ప్రతి నిర్ణయం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులు రాబోయే తరాలకు ఆధునిక తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకుతాయని వివరించారు. భవిష్యత్తులో ప్రపంచ దృష్టిని ఆకర్షించే నగరంగా ఫ్యూచర్ సిటీ ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఇప్పటికే పోలీసు కమిషనరేట్ ప్రక్రియ పూర్తయిందని, అనేక ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతంగా ముందుకు తీసుకుపోతున్నామని చెప్పారు. ఈ నగరం దేశానికే తలమానికంగా ఉంటుందన్నారు. ప్రాజెక్టు ద్వారా లక్షలాది



మంది యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శాశ్వత భవనానికి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. 'ఫ్యూచర్ సిటీ నిర్మాణం విషయంలో సానుకూల దృక్పథంతో ప్రభుత్వం ముందుకెళ్తుంటే, కొంతమంది నెగిటివ్ ఆలోచనలతో పగటి కలలు కంటున్నారు. వారి కలలకు అర్థం చెప్పలేముగా' అని మాజీ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి పొంగులేటి, శ్రీధర్‌బాబు పరోక్షంగా విమర్శలు చేశారు. 'వారు పగటి కలలు ఎన్ని కంటారో కననీయండి... వారి కలలు దీవెనలుగా భావిస్తుస్తాం' అని వ్యాఖ్యానించారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణంలో ప్రతిపక్షాలు సహకరిస్తాయని భావిస్తున్నామని తెలిపారు.

# ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా

**గవర్నర్ కార్యదర్శికి లేఖ.. క్యాబినెట్ సభ్యులకు అల్పాహార విందు**

**తదుపరి సీఎం డీకే అని ప్రకటన.. సహకరించాలంటూ సూచన**



**బెంగళూరు, మే 28**

కర్ణాటక ప్రభుత్వ నాయకత్వ మార్పుపై ఉత్కంఠకు తెరపడింది. సీఎం పదవి చేపట్టడానికి డీకే శివకుమార్‌కు లైన్ క్లియర్ అయ్యింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా చేశారు. మంత్రులతో కలిసి ఆయన గురువారం మధ్యాహ్నం లోక్ భవన్‌కు వెళ్లారు. గవర్నర్ థావర్ చంద్ గెహ్లోత్ అందుబాటులో లేని కారణంగా ఆయన ప్రత్యేక కార్యదర్శి ప్రభు శంకర్‌కు రాజీనామా లేఖ సమర్పించారు. అధిష్ఠానం పిలుపు మేరకు 26వ తేదీన ఢిల్లీ వెళ్లిన సీఎం సిద్దరామయ్య, అక్కడ జరిగిన చర్చల అనంతరం రాజీనామాకు సిద్ధపడ్డారు. రెండు రోజుల్లో రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన ఆదేశాలను పాటించారు. తర్వాత బెంగళూరుకు తిరిగి వచ్చిన సిద్దరామయ్య, మంత్రులను గురువారం ఉదయం బ్రేక్‌ఫ?స్టకు ఆహ్వానించారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు అల్పాహార విందుకు హాజరయ్యారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు మధ్యాహ్నం తర్వాత పదవికి రాజీనామా చేస్తున్నానని సిద్దరామయ్య సహచర క్యాబినెట్ సభ్యులకు చెబుతూ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. అందరూ అధిష్ఠానం ఆదేశాలను పాటించాల్సిందేనన్నారు. మూడేళ్లపాటు తనకు సహకరించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాబోయే సీఎం డీకే శివకుమార్ అని అధిష్ఠానం తెలిపిందని, మంత్రులు, సీనియర్ నేత లు ఆయనకు సహకరించాలని సూచించారు. ఈ సమయంలో డీకే శివకుమార్ సిద్దరామయ్యకు పాదాభివందనం చేసి ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీకే కూడా భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం లోక్‌భవన్‌కు వెళ్లిన సీఎం సిద్దరామయ్య, తన రాజీనామా లేఖను సమర్పించారు. తర్వాత సీఎం హోదాలో చివరిసారిగా అధికారిక నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'నా రాజకీయ జీవితం తె రిచిన పుస్తకం. 1983లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యా ను. 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. నైతిక విలువలతో, నమ్మిన సిద్ధాంతాలతో పనిచేశాను. ఎన్నడూ రాజీపడలేదు. అధికారం, ఆదాయం కోసం వెంపర్లాడలేదు.

# సుప్రీంకోర్టు జడ్జీలుగా అయిదుగురి పేర్ల సిఫార్సు

**వీరిలో నలుగురు సీజేలు, ఒక మహిళా న్యాయవాది**



**న్యూఢిల్లీ, మే 28:**

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియామకానికి అయిదుగురు పేర్లను సిఫార్సు చేస్తూ కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఇందులో నలుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కాగా, మరొకరు సుప్రీంకోర్టులోని సీనియర్ మహిళా న్యాయవాది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 27 తేదీల్లో భేటీ అయిన కొలీజియం న్యాయమూర్తుల నియామకంపై చర్చలు జరిపింది. పంజాబ్-హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జమ్మూ-కశ్మీర్- లద్దాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ పల్లిలకు పదోన్నతి కల్పించాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న వి.మోహనను కూడా న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది.

# అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ను మంజూరి చేయాలి



**కరీంనగర్ మే 28**

తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ప్రారంభించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం లక్షలాది పేద ప్రజలకు ఒక ఆశాకిరణంగా నిలువాలని . పేదలకు గౌరవప్రదమైన జీవితం ఇవ్వాలనే ఉద్దేశంతో నిర్మించిన రాజకీయ ప్రయోజనకోసం మరుగున పడేయడం దురదృష్టకరం కోట్లది రూపాయల ప్రజాధనం నిర్మించిన ఇడ్లు నిరూపయోగంగా ఉండడం నిరుపేదలకు శాపంగా మారింది, నేడు అనేక ప్రాంతాల్లో ఖాళీగా ఉండటం చాలా బాధాకరం. కొన్ని చోట్ల పూర్తిగా నిర్మాణం పూర్తయి కూడా ప్రజలకు అందకుండా నిరుపయోగంగా ఉండిపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో సంరక్షణ లేక పాడైపోతున్నాయి. ఆసాంగిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి, ఇది కేవలం ప్రభుత్వ ఆస్తి వృథా కావడం మాత్రమే కాదు– పేదల ఆశలు, కన్నీళ్లు, జీవితాల నిర్లక్ష్యం కూడా. ఈ రోజు కూడా వేలాది నిరుపేద కుటుంబాలు అద్దె ఇళ్లలో కష్టాలు పడుతున్నాయి. వర్షం పడితే పైకప్పు కారే ఇళ్లు, విద్యుత్ లేని గుడిసెలు, భద్రత లేని నివాసాల్లో జీవిస్తున్నారు. అలాంటి అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం "ప్రజల ప్రభుత్వం" ఐన నిజంగా ప్రజల పక్షాన నిలవాలంటే, ముందుగా పేదల గృహ సమస్యను పరిష్కరించాలి. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను రాజకీయ కోణంలో చూడకుండా, ప్రజల అవసరాల కోణంలో చూడాలి. మా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నాము రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై వెంటనే సమగ్ర సర్వే నిర్వహించాలి. నిర్మాణం పూర్తయి ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన పేదలకు పారదర్శకంగా కేటాయించాలి. రాజకీయ సిఫార్సులు, అవినీతి లేకుండా నిజమైన పేదలకే ప్రాధాన్యత ఇవ్వాలి. దళితులు, బీసీలు, గిరిజనులు, వికలాంగులు, ఒంటరి మహిళలు వంటి బలహీన వర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలి. పాడైపోతున్న ఇళ్లను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు చెప్పినట్లుగా – "సమాజంలోని చివరి మనిషికి న్యాయం జరిగితేనే నిజమైన అభివృద్ధి." ఆ భావజాలంతోనే మేము ఈ డిమాండ్‌ను ప్రభుత్వానికి వినిపిస్తున్నాం. ఇళ్లు కట్టడం గొప్ప విషయం. కానీ అవి నిజంగా పేదల జీవితాల్లో వెలుగు నింపినప్పుడే ఆ పథకానికి అర్థం ఉంటుంది. ఖాళీగా ఉన్న ఇళ్లు ఒక వైపు... ఇల్లు కోసం ఎదురుచూస్తున్న పేదలు మరోవైపు... ఈ పరిస్థితి సమాజానికి మంచిది కాదు. కాబట్టి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, వెంటనే చర్యలు తీసుకోవాలని మేము హృదయపూర్వకంగా కోరుతున్నాం. ఇది రాజకీయ విమర్శ కాదు... ఇది పేదల తరపున సామాజిక విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసిన సువీన్ యాదవ్

**బోయినిపల్లి నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు ఘనంగా అభినందించిన ప్రభుత్వ విప్**

**నివాసంలో ఆత్మీయ స్వాగతం.. సువీన్ యాదవ్ తో పాటు హాజరైన కాంగ్రెస్ నాయకులు**

**బోయిన్ పల్లి మే 28**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్మనబోయిన సువీన్ యాదవ్ ఈరోజు వేములవాడ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ గౌరవనీయులు శ్రీ ఆది శ్రీనివాస్ గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సువీన్ యాదవ్ కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విప్ ఆది శ్రీనివాస్ గారు సువీన్ యాదవ్‌కు ఆత్మీయంగా కరచాలనం చేస్తూ అభినందనలు తెలియజేశారు. అనంతరం శాలువ కప్పి సత్కరించారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా ఆయన నూతన అధ్యక్షుడికి దిశానిర్దేశం చేశారు.

**కుటుంబ అనుబంధాన్ని గుర్తుచేసుకున్న విప్:**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సువీన్ యాదవ్ కుటుంబంతో తమకు దశాబ్దాలుగా ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా మల్లేష్ యాదవ్‌తో ఉన్న సడలని బంధాన్ని, నాటి రాజకీయ, వ్యక్తిగత ప్రయాణాన్ని గుర్తుచేసారు. పార్టీ కోసం, ప్రజా సేవ కోసం ఆ కుటుంబం చేసిన కృషిని కొనియాడారు. ఆనాటి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, అదే నిబద్ధతతో సువీన్ యాదవ్ కూడా ప్రజల్లో ఉంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో బోయినిపల్లి మండల పరిధిలోని పలువురు ముఖ్య ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా తడగొండ గ్రామ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ చేపూరి వెంకటేష్, మైనారిటీ



నాయకులు మహమ్మద్ హుస్సేన్, ఇటీవల నూతనంగా ఎంపికైన ఆత్మ (సూహీూ) కమిటీ మెంబర్ గుడి శ్రీనివాస్ రెడ్డి, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు రజినీకాంత్ తదితరులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారిని కలిసి మండల పరిధిలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. భేటీ అనంతరం నాయకులు మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ గారి యువ నాయకత్వంలో బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో అత్యంత పటిష్టమైన శక్తిగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందేలా తామంతా ఒకే తాటిపై నడుస్తూ అహర్నిశలు శ్రమిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపి జేబు సంస్థలా?

**కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ పై ఈడీ దాడులను ఖండించండి**

**రాజకీయ దురుద్దేశంతోనే ఈడీ దాడులు**

**సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**




**కరీంనగర్ మే 28**

కేంద్ర దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించకుండా బిజెపి మోడీ ప్రభుత్వం తమ జేబు సంస్థలుగా వాడుకుంటూ ప్రతిపక్ష నాయకులపై దాడులు కొనసాగిస్తుందని, అందులో భాగంగానే కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ ఇంటిపై బుధవారం ఈడి దాడులు చేయించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి ఆరోపించారు.గురువారం రోజున సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పిన రాయ్ విజయన్ ఇంటిపై ఈడి దాడులను ఖండిస్తూ, సిపిఎం కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గీతాభవన్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో, ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థులను వేటాడిందుకు కేంద్ర ఏజెన్సీలను బిజెపి తమ సొంత జేబు సంస్థలుగా వాడుకుంటుందన్నారు. కేంద్ర అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఈడి, ఐటీ, ఎలక్షన్ కమిషన్ను బిజెపి దుర్వినియోగం చేస్తూ, ప్రశ్నించే గొంతులను అణచివేస్తుందన్నారు. అంబానీ, ఆదాని ఇళ్లల్లో, ఆఫీసుల్లో సోదాలు చేస్తే వేలకోట్ల రూపాయల అవినీతి, అక్రమ సొమ్ము దొరకదా అని ప్రశ్నించారు. మనీ లాండరింగ్ అంటూ నిరాధార ఆరోపణలతో విజయన్ ఇంటిపై ఇన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడి) దాడులు చేసిందన్నారు. దేశంలో ప్రశ్నించే వ్యక్తులే టార్గెట్ గా బిజెపి పాలన కొనసాగుతుందన్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సిపిఎం నేతలపై ఒక్క కేసు కూడా లేదని, సిపిఎం విలువలతో కూడిన పార్టీ అన్నారు. కార్పొరేట్ సంస్థల నుంచి ఇతర పార్టీల మాదిరిగా ఎన్నికల బాండ్లు సేకరించలేదన్నారు. 2017-21 మధ్యకాలంలో ఒక ప్రైవేటు మైనింగ్ కంపెనీ నుండి విజయన్ కుమార్తెకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్ సంస్థకు అక్రమంగా రూపాయలు 1. 72 కోట్లు నగదు బదిలీ చేశారని అభియోగం చేశారని, ఈ ఆరోపణలను అప్పట్లోనే విజయన్ కుమార్తె వీణా ఖండించారని గుర్తు చేశారు. మొన్నటి ఎన్నికల్లో విజయన్ పై ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తూ ప్రచారస్త్రంగా వాడుకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలని గుర్తు చేశారు. ఈ కేసులో విజయన్ కు ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు లేవని న్యాయస్థానాలు సైతం తేల్చి చెప్పాయన్నారు. అయినా సిపిఎం శ్రేణులను భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా తాజాగా ఈ దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం పెద్ద కుట్రకు పాల్పడ్డారన్నారు. రాజకీయ ప్రత్యర్థులను వేటాడేందుకు కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించే బిజెపి పాసిస్ట్ పద్ధతిలోకి రాష్ట్రంలోని యూ డి ఎఫ్ ప్రభుత్వం కూడా చేరుతుందన్నారు. బిజెపి,కాంగ్రెస్ మధ్య అపవిత్ర కూటమికి నిదర్శమని ఆరోపించారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నాయకులను, ప్రశ్నించే గొంతులను, తుద ముట్టించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి వాడుకుంటూ, దుర్వినియోగం చేస్తుందన్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విషయంలో కూడా ఇలానే జరిగిందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా లాంటి మేధావులను సైతం అకారణంగా సంవత్సరాల తరబడి జైల్లో బంధించిన చరిత్ర బిజెపిదే అన్నారు. కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్న బిజెపి, బలమైన ప్రత్యర్థి పార్టీల నాయకులను టార్గెట్గా చేసి దర్యాప్తు సంస్థలను ఉసిగొలుపుతుందన్నారు.ప్రత్యర్థి పార్టీల నాయకులుగా ఉన్నప్పుడు వారిపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి, దాడులు చేయించి, భయపెట్టి బిజెపిలో చేర్చుకున్న తర్వాత విచారణలు ఆగిపోయాయని గుర్తు చేశారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సురేందు అధికారి, అధికారి అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ శర్మ ఈకోవాకే చెందిన వారన్నారు. అత్యంత అవినీతిపరులు బిజెపి పార్టీలోనే ఉన్నారన్నారు.ఈడీలకు, బేడీలకు, మోడీలకు భయపడే పార్టీ సిపిఎం కాదని, ఉడుత ఊపులకు బెదిరేది లేదని, స్వాతంత్ర పోరాటంలో ఆనాడు బ్రిటిష్ వారిని ఎదిరించిన చరిత్ర కమ్యూనిస్టు నాయకులదన్నారు. ప్రజలను సమీకరించి రాజకీయ, న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, జి బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్, సుంకర సంపత్, ఎడ్ల రమేష్, జిల్లా నాయకులు తిప్పారపు సురేష్, గజ్జల శ్రీకాంత్, రాయి కంటి శ్రీనివాస్, పుల్లెల మల్లయ్య, మాతంగి శంకర్, రత్నం సురేష్, సందేశ్, రాకేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం రైతుల సమస్యలు పరిష్కరించాలి

**ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్**



**బోయిన్ పల్లి, మే 28**

బోయిన్ పల్లి మండలం లోని బూరుగు పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం త్వరతగతిన పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం రైతులు ఇప్పటికీ కూడా వడ్లు కొనుగోలు కాక కల్లాల వద్ద ఐ కె పి సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు అని వారి బాధల పై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ లేకుండా ఉన్నదని తక్షణమే రైతుల పట్ల చిత్తశుద్ధితో పనిచేసి వారి ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు లచ్చయ్య, అంజయ్య,సతీష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ సెలవు దినం అయినప్పటికి యదేచ్ఛంగా మట్టిని తరలించకపోతున్న కాంట్రాక్ట్, మట్టి మాఫియాలు

**కరీంనగర్ మే 28**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం దుంద్రపల్లి, కో రెమ్,మధ్యలో చెరువులోని మట్టిని లారీలల్లో తోడేస్తూ తరలించకపోతున్న కూడా చూసి చూడనట్టు వ్య వరిస్తున్నటువంటి బోయిన్పల్లి మండల అధికార రెవిన్యూ యంత్రాంగం. మరి ఈరోజు జాతీయ సెలవు దినం బక్రీద్ అయినప్పటికీ ఇదే అదునుగా భావించి మట్టి మాఫియాలు చెలరేగిపోతూ ఊరి సంపద అయినటువంటి, ప్రకృతి సంపద అయినటువంటి మట్టిని తరలించి పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నా కూడా ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని చెప్పి రైతాంగం పక్షాన, సిపిఎం పార్టీ పక్షాన భావించడం జరుగుతుంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడి ప్రకృతి మట్టి వనరులను కాపాడాలని ఈ సందర్భంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్, గురి జాల శ్రీధర్ రైతాంగం పక్షాన ప్రభుత్వానికి విజ్ఞప్తి జరుగుతుంది.

## వడదెబ్బతో వృద్ధుడి మృతి

**బోయిన్ పల్లి, మే 28**



బోయిన్ పల్లి మండలం లోని బూరుగుపల్లి గ్రామంలో గౌడ కుటుంబానికి చెందిన పెరుమాండ్ల సంజయ్య 78 గత కొంత కాలంగా విపరీతమైన ఎండలకు తట్టు కోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.బుధవారం రోజున తీవ్ర అస్వస్థతకు గురి అయి రాత్రి 7 గంటలకు ఇంటి వద్ద మృతి చెందినట్లు పేర్కొన్నారు.

## సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలి: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలి**

**వేములవాడ రూరల్, బోయినిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ**




**బోయిన్ పల్లి, మే 28**

రైతుల నుంచి సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం తరలించేందుకు సరిపడా వాహనాలు సమకూర్చాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్ నగర్, బోయినిపల్లి మండల కేంద్రం, కోరెం, బూరుగుపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి తరలించాలని, రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. వర్షం కారణంగా తడిసిన ధాన్యం విషయంలో రైతులు అధైర్యపడకుండా ధాన్యం సేకరిస్తామని భరోసా కల్పించాలని సూచించారు. రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. తూకం వేసిన ధాన్యం లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్య పెంచుకుని కొనుగోళ్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.



# కార్మికలోకానికి శాపం ఈ కమ్యూనిస్టులు




'కమ్యూనిస్టులు కార్మికుల పేరుతో రాజకీయ లాభాల కోసం బంద్‌లు, ఆందోళనలకు పిలుపునిస్తారు. ఈ రోజు బంద్‌లో పాల్గొన్న కార్మికుడు రేపు ఆకలితో అలమటిస్తాడు. వారిని ఆకలితో మాడ్చే కమ్యూనిస్టులు కార్మికుల శత్రువు కాదా?' అని అంబేడ్కర్ స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో వ్యాఖ్యానించారు. డెబ్బై ఏళ్లు దాటినా కమ్యూనిస్టులు ఏమీ మారలేదు. కొత్తగా వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ పట్ల వారి వ్యతిరేకతే దీనికి ఎళీళీజువు. మారుతున్న కాలంతో పాటు మారుతున్న ఉపాధి రంగాల్లో కార్మికులకు మేలు చేసేందుకు కేంద్రం పాత చట్టాలను తొలగించి వాటి స్థానంలో నాలుగు కొత్త లేబర్ కోడ్స్‌ను తెచ్చింది. కమ్యూనిస్టులు మంచిని చూడకుండా, అవి కార్మికలకు వ్యతిరేకం అని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు. ఇప్పటివరకూ ఉన్న 29 కార్మిక చట్టాలు ప్రధానంగా 1940 నుంచి 1990 మధ్య కాలంలో వచ్చాయి. అంటే బ్రిటిష్ కాలం చివరి రోజుల నుంచి స్వాతంత్ర్యం తర్వాత మొదటి 40-45 ఏళ్లలో తయారయ్యాయి. మినిమమ్ వేజెస్ యాక్ట్, ఫ్యాక్టరీస్ యాక్ట్, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాలు 1948-1952 మధ్యే వచ్చాయి. ఆ కాలంలో భారత్ ఇంకా పారిశ్రామికీకరణ మొదటి దశలో ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ ఆధారితం. ఈ చట్టాలు వర్తించే పరిశ్రమలు నూలు మిల్లులు, జూట్ మిల్లులు, బొగ్గు%--%ఇనుము గనులు, రైల్వే, టీ, కాఫీ, రబ్బరు తోటలు, బీడీ పరిశ్రమ, ఇనుము-ఉక్కు కర్మాగారాలు, పోర్ట్ %ఒ% డాక్ యార్డులు. ఇప్పుడు ఈ తరహా పరిశ్రమలు ప్రభావం సన్నగిల్లింది. టెక్స్‌టైల్స్ మిల్లులు మూతపడ్డాయి, గనులు ఆటోమేషన్‌లోకి వెళ్లాయి. కొత్త రంగాలు ఐటీ, గిగ్ ఎకానమీ, ఈ%--%కామర్స్, డెలివరీ సర్వీసెస్ వచ్చాయి. పాత చట్టాలు ఇప్పటి కార్మికులకు సరిపడకపోవడంతో, కేంద్రం నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు తీసుకొచ్చింది. కొత్త లేబర్ కోడ్‌లు సరళంగా, ఒకే చట్టంలో అన్నీ ఉన్నాయి. వేజెస్ కోడ్ ద్వారా కార్మికుల వేతనాలు, మినిమమ్ పే, బోనస్‌లు నిర?యిస్తారు. మినిమమ్ వేతనం జాతీయ స్థాయిలో నిర?యిస్తారు. రాష్ట్రాలు తమ పరిస్థితుల ప్రకారం మార్చవచ్చు. కాబట్టి పేద కార్మికులకు మంచి పే వస్తుంది. వేతనాల్లో అలవెన్స్‌లు పెంచి, బేసిక్ పే మెరుగుపరచడం వల్ల పీఎఫ్, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు పెరుగుతాయి. బోనస్ 8.33శాతం నుంచి పెంచారు. కార్మికుల చేతికి వచ్చే డబ్బు పెరుగుతుంది. వివాదాలు త్వరగా పరిష్కరించడానికి ఒకే లేబర్ కోర్ట్ ఏర్పాటు అవుతుంది. పాత చట్టాల్లో 5-6 కోర్టులు ఉండటం వల్ల కేసులు ఆలస్యమయ్యాయిబీ ఇప్పుడు 3-6 నెలల్లో పరిష్కారమవుతాయి. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా శాశ్వత కార్మికుల్లా గ్రాట్యుటీ, పీఎఫ్ ఇవ్వాలి. ఇది 90శాతం అసంఘటిత రంగ కార్మికులకు మేలు చేస్తుంది. ఇప్పుడు యువత ఎక్కువగా గిగ్ వర్కర్లుగా ఉన్నారు. ఈ లేబర్ కోడ్స్ ద్వారా ఉబర్, జోమాటో డ్రైవర్లు, ప్లాట్‌ఫాం వర్కర్లకు మొదటిసారి భద్రత లభిస్తుంది. ఇన్సూరెన్స్, మెడికల్, పెన్షన్ హామీ ఇస్తున్నారు. 90శాతం అన్‌ఆర్గనైజ్డ్ కార్మికులు కవర్ అవుతారు. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ పెరిగి, రూ.21,000 వేతనం వరకు కవర్ అవుతాయి. మెడికల్ సహాయం, మ్యాటర్నిటీ బెనిఫిట్‌లు లభిస్తాయి. చిన్న ఫ్యాక్టరీలు అంటే పదిమంది ఉద్యోగులు, కార్మికులు ఉన్న కంపెనీలు కూడా సేఫ్టీ చెక్‌లు చేయాలి. ఇది మహిళలు, చిన్న కార్మికులకు రక్షణ ఇస్తుంది. మ్యాటర్నిటీ లీవ్ 26 వారాలకు పెంచారు. వారానికి 48 గంటలు పనిలో మార్పు లేదు. ఓవర్ టైమ్‌కు అదనపు చెల్లింపులు చేయాలి. పాత 29 చట్టాలు గందరగోళంగా ఉండటం వల్ల కార్మికులు ప్రయోజనాలు పొందలేదు. ఇప్పుడు ఈ కొత్త నాలుగు చట్టాల్లో అన్నీ స్పష్టంగా ఉన్నాయి. కానీ కమ్యూనిస్టులు ఈ చట్టాలు కార్మిక వ్యతిరేకమనీ, కార్పొరేట్లకు మేలు చేస్తాయనీ ప్రచారం చేస్తున్నారు. లేబర్ కోడ్స్‌లో ప్రతిదానికీ లేని అర్థాన్ని వెతుక్కుని తప్పుడు ప్రచారాలు చేస్తూ కార్మికులను తమ గ్రిప్‌లో ఉంచుకుని వారి జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్నారు. వారంలో పని గంటలు పెంచినట్లుగా ప్రచారం చేస్తున్నారు. వారానికి 48గంటల పని విషయంలో ఎలాంటి మార్పు లేకపోగా, కార్మికులు అదనపు పని చేసుకుని అదనంగా సంపాయించుకునే అవకాశాన్ని కల్పించారు. దీన్ని కూడా తప్పుగా అన్వయిస్తున్నారు. కంపెనీలు బాగుంటేనే కార్మికులు బాగుంటారన్న విషయాన్ని కమ్యూనిస్టులు అంగీకరించడం లేదు. అసలు లేబర్ కోడ్స్‌పై అభ్యంతరాలేమిటో కమ్యూనిస్టులకే స్పష్టత లేదు. 'కార్పొరేట్లకు మేలు', 'కార్మిక హక్కులకు పాతర'... ఇలా పడికట్టు పదాలతో ఎప్పట్లాగే రాజకీయం చేస్తున్నారు. లేబర్ కోడ్స్ ద్వారా ప్రధానమంత్రి మోదీ కార్మికవర్గానికి సరికొత్త శక్తిని ఇస్తున్నారు. ఈ మార్పులు కేవలం చట్టాలు కాదుబీ భారత శ్రామిక శక్తిని ఆత్మవిశ్వాసంతో మరింత శక్తివంతంగా తీసుకెళ్లే విజన్. కొత్త లేబర్ కోడ్స్ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో పారదర్శకత పెరగడమే గాక, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. శ్రామిక శక్తి ఆధారిత అభివ ృద్ధి అనే లక్ష్యాన్ని చేరుకునే దిశలో ఇది ఒక సుస్థిరమైన అడుగు. కమ్యూనిస్టులు కార్మికుల హక్కుల పోరాటం అంటారు కానీ పరిశ్రమల నాశనమే విధానంగా పనిచేస్తారు. పశ్చిమ బెంగాల్ 1960 నాటికి పారిశ్రామికంగా దేశంలో రెండో స్థానంలో ఉండేది, కానీ ట్రేడ్ యూనియన్ మిలిటెన్సీ వల్ల పరిశ్రమలు మూతపడి పారిశ్రామికీకరణ ఆగిపోయి 2000 నాటికి పదవ స్థానానికి పడిపోయింది. ఇండస్ట్రియల్ ఔట్‌పుట్ షేర్ 24శాతం నుంచి 3.7శాతానికి తగ్గింది. దీనివల్ల నష్టపోయింది ఎవరు? కమ్యూనిస్టులు కార్మికులను ఓటుబ్యాంకుగా చూస్తారు, చేసుకుంటారు. ఎప్పటికప్పుడు వారిని రెచ్చగొట్టి ఉద్యమాలకు ప్రేరేపించి గుప్పిట్లో ఉంచుకుంటారు. వారికి మంచి జరిగే చట్టాలు వచ్చి బాగుపడితే తమకు ఇక పుట్టగతులు ఉండవని నిత్యం రెచ్చగొడతారు. ఇలాంటి వారికి ఇక కార్మికులు, ప్రజలు అవకాశం ఇవ్వరు. సరైన సమయంలో సరైన బుద్ధి చెబుతారు.

# ఆస్ట్రేలియా ఆదర్శం..



పదహారేళ్ళలోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడానికి ఆస్ట్రేలియా చేసిన ప్రయత్నం బాగుంది. దీరకాలం మల్లగుల్లాలుపడి, చివరకు ధైర్యంగా తెచ్చిన ఈ చట్టం రెండురోజులక్రితం అక్కడ అమలులోకి వచ్చింది. ఆశయం మంచిదే, ఆచరణే కష్టం.. అని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ స్వయంగా ఓ మాటన్నప్పటికీ, ఒకవేళ అనుకున్నంతగా విజయం కాక, వైఫల్యాలు ఎదురైనప్పటికీ, ఒక మాయాప్రపంచం నుంచి పిల్లలను రక్షించే సదుద్దేశంతో మొదలుపెట్టిన ఈ ప్రయత్నం ప్రశంసనీయమైనది. వయసు, అనుభవం ఉన్నదనీ, తమకే అంతా తెలుసుననీ అనుకుంటున్న పెద్దలే ఈ సోషల్ మీడియా మాయలో పడి గింగిరాలు తిరుగుతూంటే, తెలిసీ తెలియని వయసు పిల్లలు దాని వలలో పడి, ప్రభావితులు కాకుండా ఉండటం అసాధ్యం. పసిహ ృదయాలపై దీని దుష్ప్రభావాలు, మానసిక రుగ్మతలమీద ఆస్ట్రేలియా ప్రభుత్వం లోతైన అధ్యయనాలు జరిపి, పదహారేళ్ళలోపు వారిని పూర్తిగా సోషల్ మీడియాకు దూరం పెట్టవలసిందేనని నిర?యానికి వచ్చింది. డిజిటల్ స్వేఛ్ేఅని మనం ముద్దుగా అంటున్నదానికి పూర్తిదూరంగా ఉన్నదేశాలు కూడా ఈ ప్రపంచంలో అనేకం. ఎత్తయిన గోడలు కట్టి పాక్షికంగా అనుమతిస్తున్న దేశాలూ ఉన్నాయి. పిల్లలను సోషల్‌మీడియాకు పూర్తిగా దూరం చేయడం సరికాదంటూ చిన్నాచితకా జాగ్రత్తలతో యథాతథంగా అనుమతిస్తున్న దేశాలే అధికం. కానీ, ఆస్ట్రేలియా మాత్రం ఎటువంటి మినహాయింపులూ ఇవ్వడానికి సిద్ధపడలేదు. ప్రధానిగా ఉన్నందుకు ఎన్నడూ తనకు ఇంత సంతోషం కలగలేదని, మిగతా ప్రపంచా నికి ఆస్ట్రేలియా దారిచూపి ంచిందని అల్బనీస్ గర్విస్తున్నారు. ఇదేదారిలో తూచ తప్పకుండా నడుస్తామని ఇప్పటికే కొన్ని దేశాలు ప్రకటించాయి. ఆస్ట్రేలియాలో మూడింట రెండువంతులమంది ఓటర్లు, రాజకీయపక్షాలు ఈ నిర?యానికి అనుకూలంగా ఉండటం విశేషం. టెక్ కంపెనీలు తలెగరేయకుండా, తోకజాడించకుండా ఉండటానికే ఆస్ట్రేలియా ప్రభుత్వం మొన్న సెప్టెంబరులో ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావించి, వయసు పరిమితి అవసరాన్ని నొక్కివక్కాణించి, మిగతా ప్రపంచాన్ని తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేసిందని అంటారు. మెసేజింగ్ యాప్‌లు మినహా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, ఎక్స్, యూట్యూబ్ ఇత్యాది పది ప్లాట్‌ఫామ్‌లు ప్రస్తుతానికి ఈ నిర?యం పరిధిలోకి వస్తున్నప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని వచ్చిచేరవచ్చు. పదహారేళ్ళ లోపువారు ఈ వేదికల్లోకి చొరబడినపక్షంలో వారినీ, తల్లిదండ్రులనూ కాక, కంపెనీలనే భారీ పెనాల్టీలతో శిక్షించాలన్నది మంచి నిర?యం. అవి అనుసరించబోయే వయసు నిర్ధారణ విధానాలమీద అనుమానాలు, గోప్యత భయాలు ఉన్నప్పటికీ, ఉల్లంఘనలకు తావులేని రీతిలో చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత పూర్తిగా వాటిదే. ఆదిలో వీరంగాలు వేసి, హెచ్చరికలు చేసిన టెక్ కంపెనీలు క్రమంగా చల్లబడ్డాయి. తాము, తమ మిత్రులు నిషేధాన్ని ఎలా ఉల్లంఘించామో ప్రధానికే ఆస్ట్రేలియా పిల్లలు చెబుతున్నారట. విపిఎన్‌ల వాడకంతోపాటు, ఇతరత్రా అడ్డుతోవల్లో ఈ అడ్డుగోడ ఛేదించేందుకు ఎక్కువమంది ప్రయత్నిస్తున్నారట. ఇవన్నీ తాము ఊహించనివేమీ కాదని, ఈ తరం పిల్లలు ఎంత ఘటికులో తెలుసునని ప్రభుత్వం అంటోంది. ఇప్పుడు నిషేధాన్ని మెచ్చుకున్నవారే రేపటి రోజుల్లో తమ పిల్లల నిరసన, ఒత్తిడి భరించలేక వ్యతిరేకంగా తయారయ్యే అవకాశమూ లేకపోలేదు. రిడిట్ చూపినదారిలో మిగతా కంపెనీలు కూడా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. సోషల్‌మీడియా వాడకాన్ని ఒక వ్యసనంలాగా మార్చివేసే ఆల్గరిథమ్స్‌నుంచి, విషపూరిత కంటెంట్‌నుంచి, ఆన్‌లైన్ అవమానాలు, వేధింపులు, బెదిరింపులనుంచి పిల్లలను కాపాడుకోవాలన్న ఈ ప్రయత్నం ప్రశంసనీయమైనది. ఎదిగేవయసులో ఈ ఉచ్చులో చిక్కి, చదువు, నిద్ర, ఆటకు దూరమై, సకల సామర్థ్యాలు భావోద్వేగాలు కోల్పోయి, వాస్తవిక ప్రపంచానికి దూరంగా మిగులుతున్నారు పిల్లలు. ఒక అబద్ధాల ప్రపంచంతో తమను పోల్చుకుంటూ ఆత్మన్యూనతలోకి జారిపోతున్నారు, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులు చేతులెత్తేసిన ఒక తీవ్రమైన సమస్యని ఆస్ట్రేలియా ప్రభుత్వం నెత్తినెత్తుకొని, మిగతాదేశాలకు దారిచూపుతున్నందుకు సంతోషిస్తున్నవారే అధికం.

# ఉన్నత విద్యకు దిక్సూచి ఏకీకృత చట్టం

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత విద్యారంగం ఆర్థిక, పరిపాలనా ప్రతికూలతలు, నిర్మాణాత్మక అడ్డంకులు ఎదుర్కొంటున్నప్పటికీ, అంతర్జాతీయ ప్రమాణాలకు సరిసమానంగా తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగుతున్నది. కోర్సుల రూపకల్పనలో ఆధునికత, సిలబస్ పునర్వ్యవస్థీకరణ, బోధన%--%అధ్యయన విధానాల్లో నవీనత, పరిశోధన-అభివ ృద్ధికి ప్రాధాన్యం, ఇన్నోవేషన్-స్టార్టప్-ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకోసిస్టమ్ బలోపేతం వంటి రంగాల్లో గత కొన్నేళ్లలో జరిగిన సంస్కరణలు ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మానవ వనరుల అభివ ృద్ధి శాఖ రూపొందిస్తున్న 'ఏకీక ృత విశ్వవిద్యాలయాల చట్టం' ఉన్నత విద్యా పరిపాలనలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభించే కీలక ప్రయత్నంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్‌గాంధీ సాంకేతిక విజ్ఞాన విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జేఎన్టీయూలు, ఉర్దూ విశ్వవిద్యాలయం, ద్రావిడ విశ్వవిద్యాలయం, క్లస్టర్ విశ్వవిద్యాలయాలు వంటి అనేక సంస్థలు తమ ప్రత్యేక చట్టాల కింద పనిచేస్తున్నాయి. మరొకవైపు, సంప్రదాయ విశ్వవిద్యాలయాలకు మాత్రం ఒకే చట్టం వర్తిస్తున్నది. ఈ విభిన్న శాసన నిర్మాణం కారణంగా పరిపాలనలో అసమన్వయం, అకడెమిక్ ప్రమాణాల్లో భిన్నత్వం, నియామకాలలో అస్పష్టత, ఆర్థిక నిర్వహణలో అసమానత వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితిని సరిచేయడానికి, ఏకరీతిచేసే శాసన చట్రం ఏర్పాటు చేసి, అన్ని వర్సిటీలను ఒకే దారిలో నడిపించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. 2020లో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన 'జాతీయ విద్యా విధానం' ఉన్నత విద్యా వ్యవస్థలో మూలగామి మార్పులకు బాట వేసింది. మల్టీ-డిసిప్లినరీ విద్య విస్తరణ, అకడెమిక్ స్వతంత్రత, నాణ్యతా ప్రమాణాల ఏకరీతీకరణ, HEI క్లస్టర్ల ఏర్పాటు, పరిశోధన-ఇన్నోవేషన్‌కు ప్రాధాన్యం వంటి అంశాలు ఈ విధానం యొక్క ప్రధాన స్తంభాలు. త్వరలో అమల్లోకి రానున్న ఉన్నత విద్యా కమిషన్ ఆఫ్ ఇండియా ద్వారా దేశవ్యాప్త ఉన్నత విద్యా పరిపాలన మరింత సమీక ృతం, ప్రమాణీక ృతం కానుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం రూపొందిస్తున్న ఏకీక ృత విశ్వవిద్యాలయాల చట్టం, జాతీయ విధానాల దిశగా రాష్ట్ర ఉన్నత విద్యా నిర్మాణాన్ని అనుసంధానించే ఒక ముందడుగుగా నిలుస్తోంది. యూనిఫైడ్ యూనివర్సిటీ యాక్ట్‌ను అమల్లోకి తెచ్చిన రాష్ట్రాల అనుభవాలు సమగ్ర ఉన్నత విద్యా సంస్కరణలకు దారితీయగలవన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఈ చట్టాన్ని ముందుగా అమలు చేసి అనేక సానుకూల ఫలితాలు సాధించాయి. ఈ రెండు రాష్ట్రాల అనుభవాలు, అమలు విధానాలు ఆంధ్రప్రదేశ్‌కు మార్గనిర్దేశం చేసే నమూనాగా ఉపయోగపడే అవకాశం ఉంది. విశ్వవిద్యాలయాల ప్రధాన పరిపాలనా సంస్థ అయిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ స్థానంలో, ప్రస్తుతం కొత్త చట్టం ప్రకారం బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ ఏర్పాటు చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఈ బీఓఎమ్, విశ్వవిద్యాలయాల కీలక నిర?యాధికార సంస్థగా, పాలసీ రూపకల్పన కేంద్రంగా, కార్యనిర్వాహక మండలిగా వ్యవహరించనుంది. ఇందులో ఉపకులపతి అధ్యక్షుడిగా ఉంటారు. దీంతోపాటు అన్ని విశ్వవిద్యాలయాలు అనుసరించాల్సిన ఒక 'మోడల్ స్టాట్యూట్'ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే అవకాశం ఉంది. ప్రతిపాదిత చట్టంలో సర్వీసు కోడ్ అత్యంత కీలక అంశంగా నిలవనుంది. నియామకాలు, జీతభత్యాలు, పదోన్నతులు, పదవీ విరమణ, సేవా నిబంధనలు, ప్రవర్తనా నియమావళి, శిక్షా ప్రక్రియ వంటి అంశాలన్నింటికీ ఒకే విధమైన సర్వీసు కోడ్ రూపొందించే అవకాశం ఉంది. దీనివల్ల వర్సిటీల మధ్య ఉన్న అసమానతలు తొలగి, ఉద్యోగులలో న్యాయం, సమానత్వం, పారదర్శకత పెరుగుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కొత్త చట్టం పరిధిలోకి వచ్చే విశ్వవిద్యాలయాల్లో కులపతిగా రాష్ట్ర గవర్నర్ కొనసాగుతారనే స్పష్టత కనిపిస్తోంది. ప్రస్తుతం రాజీవ్‌గాంధీ సాంకేతిక విజ్ఞాన విశ్వవిద్యాలయంలో సీఎం కులపతిగా ఉండే ఏర్పాటు కూడా మారే అవకాశం ఉంది. 'ఏకీక ృత విశ్వవిద్యాలయాల చట్టం'ను సమతుల ద ృష్టితో, సమర్థవంతంగా అమలు చేయగలిగితే, ఉన్నత విద్యా ప్రమాణాల విషయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండే అవకాశం ఉంది.





# ఉద్దానంను జిల్లాగా ప్రకటించాలి



ఉత్తరాంధ్రలో సముద్రతీరాన్ని ఆనుకుని విస్తరించిన పచ్చని భూములు, కొబ్బరి తోటలు, పనసపండ్ల సువాసన, చేపల వేటతో సందడిగా ఉండే తీర గ్రామాలు కలిసిన ప్రాంతం ఉద్దానం. సహజసిద్ధమైన అందాలు మాత్రమే కాకుండా ఎంతో సుసంపన్నమైన ప్రాంతం ఇది. అయితే ఇన్ని సహజవనరులు ఉండి కూడా ఉద్దానం ప్రజల జీవితం దశాబ్దాలుగా ప్రశాంతంగా లేదు. ముఖ్యంగా కిడ్నీ వ్యాధులతో వేలాదిగా ప్రజలు బాధపడుతుండడం అందరికీ తెలిసిన విషయమే. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి, ప్రాంతీయ అభివ ృద్ధిని వేగవంతం చేయడానికి, ప్రజలకు పరిపాలన దగ్గర చేయడానికి, ఉద్దానంను ప్రత్యేక జిల్లాగా ప్రకటించడం అవసరం. ఇది ఒక పరిపాలనా చర్య మాత్రమే కాదు, సామాజికన్యాయం పరంగా, ఆరోగ్య పరంగా, ఆర్థికాభివ ృద్ధి పరంగా, పర్యాటక పరంగా తీసుకోవాల్సిన నిరయం. భౌగోళికంగా పరిశీలించినా ఉద్దానం పెద్ద ప్రదేశం. శ్రీకాకుళం జిల్లాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం జిల్లా కేంద్రం నుంచి చాలా దూరంగా ఉంటుంది. ప్రజలు సాధారణ ప్రభుత్వ సేవలు పొందడానికి కూడా గంటల తరబడి ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. రవాణా సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల, అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు చేరుకోవడం చాలా కష్టమవుతుంది. జిల్లా కేంద్రం దూరంగా ఉండటం వల్ల పరిపాలనలో ఉండే ఆలస్యం, పథకాల అమల్లో జాప్యం, ప్రజలకు వేగంగా సేవలు అందకపోవడం వంటివన్నీ ఈ ప్రాంత అభివ ృద్ధిని నిలువరించాయి. ఉద్దానం జిల్లాగా ఏర్పడితే ఈ సమస్యలు చాలా వరకు తగ్గిపోతాయి. ఎందుకంటే చిన్న జిల్లాలు పరిపాలనను ప్రజలకు దగ్గరచేస్తాయి. అధికారులు మెరుగ్గా పర్యవేక్షించగలుగుతారు, దాంతో పథకాలు ప్రజలకు చేరతాయి. సరైన ప్రణాళికలతో అభివ ృద్ధి చేస్తే ఈ ప్రాంతం అన్ని రకాలుగా ఎదుగుతుంది. కొత్త జిల్లా ఏర్పడితే ఈ ప్రాంతంలో ప్రత్యేక వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లు, మత్స్యరంగ అభివ ృద్ధి కేంద్రాలు ఏర్పాటు కావడానికి సౌలభ్యం ఏర్పడుతుంది. దీనివల్ల యువతకు ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయి. జిల్లా కేంద్రం ఉద్దానంలో ఉంటే, కొత్త వైద్య కళాశాలలు, ప్రత్యేక ఆసుపత్రులు, డయాలసిస్ కేంద్రాలు, గ్రామస్థాయి హెల్త్ సెంటర్లు ఏర్పడటం వేగవంతం అవుతుంది. అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు రావడం, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు పెరుగుతాయి. రాజకీయంగా కూడా ఉద్దానం జిల్లా ఏర్పడితే ఈ ప్రాంత సమస్యలు రాష్ట్ర స్థాయిలో మరింత బలంగా వినిపిస్తాయి. ఇన్ని కారణాల వల్ల ఉద్దానంను జిల్లాగా ప్రకటించాలి.

# కార్మికులు రైతులతో కలిసి సాగాలి




ప్రపంచ దేశాల పెట్టుబడుదారులను ఆకర్షించేట్టుగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే కంపెనీల ఆదాయం పెరుగుతుందన్న ఆలోచనను బడా పారిశ్రామికవేతల మదిలో బీజంగా నాటగలిగింది. దాదాపు రూ.6లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేవిధంగా రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఒక వేదిక కావడం మంచి పరిణామం. ఇప్పటికే పారిశ్రామికంగా, ఐటీ రంగాలలో అంతులేని అభివ ృద్ధి చెందుతున్న హైదరాబాద్, 2047 సంవత్సరానికి సాధించాల్సిన లక్షలతో విజన్ డాక్యుమెంట్‌ను ఈ సమ్మిట్‌లో ఆవిష్కరించారు. గతాన్ని నెమరువేసుకొని, వర్తమానాన్ని అధ్యయనం చేసి, భవిష్యత్ వైపుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అడుగులేస్తున్నట్లు ఆయన విజన్ డాక్యుమెంట్ తెలుపుతున్నది. జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో కొమురం భీమ్‌ను ఆయన గుర్తుచేసుకున్నారు. ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటానికి కీలకాంశాలైన భూమి, భుక్తి, విముక్తులను నెమరువేసుకొని తెలంగాణ సమగ్రాభివ ృద్ధి వైపు ఆయన అడుగులు వడివడిగా వేస్తున్నారు. 2047 సంవత్సరాన్ని ద ృష్టిలో ఉంచుకొని విజన్‌తో సమ్మిట్‌ను నిర్వహించినా ఐదేళ్ళల్లోనే పెట్టుబడులు పెరిగి పారిశ్రామిక అభివ ృద్ధి జరుగుతున్నట్లు స్పష్టంగా కనపడుతున్నది.

ఐటీ, ఏఐ, టూరిజం, సినీ పరిశ్రమ, ఫార్మా రంగాల్లో అధిక పెట్టుబడులు రావడం వలన సమగ్ర అభివ ృద్ధి సాధ్యమయ్యే అవకాశం ఉన్నది. నాణ్యమైన వైద్యం, విద్యను పేదలకు అందించాలనే ద ృఢ సంకల్పంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడుము బిగిస్తున్నది. చేసే ప్రతి ఆలోచనా రైతాంగం, పరిశ్రమలను కలుపుకుంటూ చేయటం శుభపరిణామం. గ్రామీణ ప్రాంతాలను, వ్యవసాయ రంగాన్ని అభివ ృద్ధి చెందే విధంగా పరిశ్రమలను ఏర్పాటు చేయం ముఖ్యం. ఇటూ వ్యవసాయ రంగాన్ని పరిశ్రమలను సమన్వయం చేసుకోవాలి. పరిశ్రమల పేరుతో వేల ఎకరాల భూములను అన్యాక్రాంతం కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండే పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వాలి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఇచ్చే కంపెనీలను ప్రోత్సహించాలి.

మానవ వనరులు, నైపుణ్యాల అభివ ృద్ధి కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం అభినందనీయం. అలాగే విద్యాభివ ృద్ధిని కూడా ముఖ్యమంత్రి పదేపదే ప్రస్తావించడం దానికి ఆయన ఇస్తున్న ప్రాముఖ్యతను సూచిస్తుంది. అయితే ఆశిస్తున్నవన్నీ ఆచరణలోకి వస్తేనే ప్రయోజనం. అందుకు నిబద్ధత కూడిన నాయకత్వం అవసరం. అలాంటి నాయకత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తారని భావిస్తున్నాను.



## ఇంతకు మించిన వార్త లేదా?

అగ్ర కథానాయిక తాప్సీ తన వైవాహిక జీవితం గురించి ఇప్పటివరకు ఎక్కడా మాట్లాడలేదు. గతకొంతకాలంగా మీడియాకు కాస్త దూరంగా ఉంటూ సినిమాల మీదనే దృష్టి పెడుతున్నదీ భామ. 2023లో డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ వివాహబంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. విరామ సమయాల్లో తన అత్తామామలను కలిసేందుకు డెన్మార్క్ వెళ్లివస్తుంటుంది తాప్సీ. ఈ నేపథ్యంలో ఆమె డెన్మార్క్‌కు మకాం మార్చిందని, కేవలం షూటింగ్ సమయాల్లోనే ముంబయికి వస్తున్నదని కొన్ని ఆంగ్ల పత్రికల్లో కథనాలొచ్చాయి. వీటిపై తాజా ఇంటర్వ్యూలో స్పందించింది తాప్సీ. తాను డెన్మార్క్‌కు షిఫ్ట్ అయినట్లు ఓ ఆంగ్లపత్రిక రాసిన వార్తను ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ సెటైరికల్‌గా రియాక్ట్ అయింది. ‘ఈ పత్రిక వారికి ఇంతకు మించిన సెన్సేషనల్ వార్త దొరకలేదు కావొచ్చు. ఏదైనా వార్త రాసేముందు కొంచెం పరిశోధన చేయండి. మీకో విషయం చెప్పాలి%ౌ% ముంబయిలోని ఈ చల్లటి వాతావరణంలో దోశ తింటూ నేను ఈ వార్తను చదువుతున్నా’ అంటూ వ్యంగ్యంగా కామెంట్ చేసింది. ఆమె పోస్ట్ వైరల్‌గా మారింది. ప్రస్తుతం తాప్సీ హిందీలో గాంధారి, ఓ లడ్‌కీ హై కహాన్ చిత్రాల్లో నటిస్తున్నది.

## నాకో బ్యాడ్ హాబిట్ ఉంది!



దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఏం చేసినా సంచలనమే. ‘అర్జున్ రెడ్డి’ ‘యానిమల్’ చిత్రాలతో ఫిల్మ్‌మేకింగ్, స్టోరీ ప్రజెంటేషన్ పరంగా కొత్త ఒరవడిని సృష్టించారు. ఈ స్టార్ డైరెక్టర్ ప్రస్తుతం ప్రభాస్‌తో ‘స్పిరిట్’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. గురువారం ప్రభాస్ జన్మదినం సందర్భంగా ఆయన తాజా చిత్రాల సంగతులతో పాటు కొత్త పోస్టర్స్ అభిమానుల్ని అలరించాయి. సౌండ్‌స్టోరీ పేరుతో ‘స్పిరిట్’ చిత్రానికి సంబంధించిన ఓ ఆడియో క్లిప్‌ని రిలీజ్ చేశారు. ఇందులో కేవలం సంభాషణల ద్వారానే కథాంశం గురించి బేసిక్ డిటేయిల్స్ అందించే ప్రయత్నం చేశారు. ప్రభాస్, ప్రకాష్‌రాజ్ మధ్య చోటుచేసుకునే ఇంటెన్స్ డైలాగ్ వార్ గూజ్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఆడియో క్లిప్‌లోని సంభాషణలను బట్టి ఈ సినిమాలో ప్రభాస్ ఐపీఎస్ ఆఫీసర్ అని అర్థమవుతున్నది. అయితే ప్రవర్తన సరిగ్గా లేదనే కారణంతో రిమాండ్ ఖైదీగా జైలుకి వెళ్తాడు. అక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రకాష్‌రాజ్..ప్రభాస్‌ని ఖైదీ డ్రెస్‌ను ధరించమని ఆదేశిస్తాడు. అందుకు తిరస్కరించిన ప్రభాస్ ‘డియర్ సూపరింటెండెంట్ సార్.. చిన్నప్పటి నుంచి నాకో చెడ్డ అలవాటు ఉంది. రైట్ ఫ్రమ్ మై చైల్డ్‌వుడ్.. ఐ హ్యావ్ ఏ బ్యాడ్ హాబిట్’ అని చెప్పడం హైలైట్‌గా నిలిచింది. ఈ డైలాగ్‌ని బట్టి ప్రభాస్ క్యారెక్టర్ ధిక్కార స్వభావంతో ఉండబోతున్నదని అర్థమవుతున్నది. సినిమా గ్లింప్స్‌ని ఆడియో ద్వారా తెలియజేయడం ఇదే ప్రథమమని.. సరికొత్త ప్రయోగమిదని అంటున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి కథానాయికగా నటిస్తున్నది. ఈ పాన్ ఇండియా చిత్రం త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## శ్రీలంకలో ‘పెద్ది’ సందడి



రామ్‌చరణ్ తాజా చిత్రం ‘పెద్ది’ ఫస్ట్ గ్లింప్స్‌తోనే సినీ ప్రేమికుల్లో ఆసక్తినిరేకెత్తించింది. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్‌చరణ్ మేకోవర్, ఆయన రగ్గ్‌డ్ లుక్స్ అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేశాయి. ‘ఉప్పెన’ ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం శ్రీలంకకు పయనమైంది. అక్కడ ఓ పాటతో పాటు కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ఆటకూలీగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన జాన్వీకపూర్ సందడి చేయనుంది. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాణం: వృద్ధి సినిమాస్, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

## శక్తిశాలినిగా సైయారా భామ

‘సైయారా’తో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసి యువప్రేక్షకుల హృదయాల్ని దోచుకుంది నాజూకు అందాల సోయగం అనీత్ పడ్డా. ఈ సినిమాలో ఆమె అందం, అభినయానికి అందరూ ఫిదా అయ్యారు. ప్రస్తుతం ఈ భామకు బాలీవుడ్‌లో భారీ అవకాశాలొస్తున్నాయి. తాజాగా ఈ సొగసరి మాడాక్ ఫిల్మ్స్‌లోని హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగం కాబోతున్నది. ఇప్పటికే ఈ ప్రొడక్షన్ హౌస్ స్త్రీ, రూహీ, భేడియా,థామా వంటి హారర్ కామెడీ చిత్రాలతో హిందీ చిత్రసీమలో ప్రత్యేకతను చాటుకుంటున్నది. మాడాక్ ఫిల్మ్స్ నిర్మించనున్న తదుపరి చిత్రం ‘శక్తిశాలిని’లో అనీత్ పడ్డా టైటిల్ రోల్‌ని పోషించనుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ‘సైయారా’ వంటి హృద్యమైన ప్రేమకథా చిత్రం తర్వాత అనీత్ పడ్డా ప్రతిష్టాత్మక హారర్ ఫ్రాంఛైజీలో ఛాన్స్ దక్కించుకోవడం ఆమె కెరీర్‌లో కీలకమైన మలుపు అని బాలీవుడ్ ట్రేడ్ వర్గాలంటున్నాయి. తొలుత ఈ చిత్రంలో కియారా అద్వాణీని నాయికగా అనుకున్నారు. డేట్స్ సమస్య వల్ల ఆమె అందుబాటులో లేకపోవడంతో చివరకు బాలీవుడ్ లేటెస్ట్ యూత్ సెన్సేషన్ అనీత్ పడ్డాను ఖరారు చేసింది చిత్రబృందం.

